క్లుప్తంగా

పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలి



నిజాంపట్నం: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ పల్లవ సేన సంక్షేమ సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పల్లవసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు మోపిదేవి శివనాగరాజు మాట్లాడుతూ కళాశాలలో గతంలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని రద్దు చేయటం బాధాకరమన్నారు. పరీక్ష కేంద్రాన్ని రద్దు చేసి దూరప్రాంతాలలో కేటాయించటంతో ఈ ప్రాంత విద్యార్థులపై అధికంగా ఒత్తిడి పడుతుందన్నారు. పరీక్ష కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సమితి నాయకులు మోపిదేవి శ్రీను, కొక్కిలిగడ్డ నాగబాబు, మోపిదేవి ఓంకార్, బొమ్మిడి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన యువకుడు అరెస్ట్



చెరుకుపల్లి: మద్యం తాగి గుళ్ళపల్లి బాలాజీ థియేటర్ ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం వీరంగం సృష్టించి పోలీసులపై అనుచితంగా ప్రర్తించిన యువకుణ్ని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్సై టి.అనీల్‌కుమార్ అందించిన వివరాల మేరకు మండల పరిధిలోని గుళ్ళపల్లి గ్రామానికి చెందిన వాగు దినేష్ అనే యువకుడు మద్యం తాగి పోలీసులపై దురుసుగా ప్రవర్తించి, వారి విధులకు ఆటంక పరుస్తూ వాహనదారులపై దుర్భాషలాడుతూ ట్రాఫిక్‌ను ఆటంక పరచి, ప్రజా శాంతికి భంగం కలిగించాడు. దినేష్‌పై హోంగార్డు కారంకి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తెనాలి రెండవ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ముద్దాయి దినేష్‌కు మార్చి 6వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మార్కెట్ ఏరియాలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు తెల్లవారుజామునే చెత్తనుతొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మురుగు కాల్వలను కూడా బాగు చేయాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, అధికారులు ఉన్నారు.

దోమల నియంత్రణకు సహకరించండి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు అందరూ సహకరించాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి కోరారు. సాలీపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం సతీష్ పాల్‌రాజ్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల పెరుగుదలకు నీటి అవాసాలే కారణమన్నారు. దోమలు నీటిలో గుడ్లు పెట్టి ఉత్పత్తిని పెంచుకుంటాయని తెలిపారు. ఇవి కుట్టడం వలన అనేక వ్యాధులు సోకుతాయని చెప్పారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. మలేరియా అధికారులు అందె బాలచంద్రమౌళి, వంగాల పున్నారెడ్డిలు మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీకంఠ ఉమాకాంత్, దీపాల శ్రీనివాసరావు, చింతాల ప్రసన్న పుష్పలత, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొల్లిపరలో పంటల సంరక్షణపై రైతు శిక్షణ

కొల్లిపర(తెనాలి): వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వ్యవసాయ పంటల సంరక్షణ సాంకేతికతలపై రైతు శిక్షణా కార్యక్రమం మండల కేంద్రమైన కొల్లిపరలో జరగనుంది. గ్రామంలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంస్థలో మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటయ్యే శిక్షణ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధు కంపురత్ పి. హాజరు కానున్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ తాతినేని రమేష్‌బాబు అధ్యక్షత వహిస్తారు. వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగం సమన్వయకర్త డాక్టర్ హాడోల్ మహేష్ వినాయక్ పర్యవేక్షిస్తారు. కొల్లిపర, వల్లభాపురం, నూతక్కి, కొలకలూరు, వేజండ్ల గ్రామాల రైతుసోదరులు హాజరై జయప్రదం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

నీరు వచ్చేనా..?

- నిరుపయోగంగా మినీ రక్షిత నీటి పథకం
- నిలిచిన సరఫరా.. పట్టించుకోని అధికారులు
- అష్టకష్టాలు పడుతున్న శిరిపూడి గ్రామస్తులు
- కిలోమీటర్ దూరం నుంచి తెచ్చుకుంటున్న కాలనీ వాసులు



ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా మారిన పంప్‌హౌస్

నగరం: గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి మినీ రక్షిత మంచినీటి పథకం పనిచెయ్యకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. మండలంలోని శిరిపూడి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యతో కాలనీ వాసులు సతమతమవుతున్నారు. కాలనీలో 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. సుమారు 800 మంది జనాభా ఉన్నారు. గ్రామంలోని చేతిపంపుల నీరు తాగడానికి పనికిరాక పోవడంతో తాగునీటి కోసం మినీ రక్షిత నీటి పథకం ఏర్పాటు చేశారు. అయితే గత మూడు నెలల నుంచి మినీ రక్షిత నీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు తాగునీటి కోసం ఊరికి దూరాన ఉన్న చేతిపంపుల నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకున్నా ప్రయోజనం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిలోమీటర్ దూరం నుంచి...

మినీ రక్షిత నీటి పథకం పనిచెయ్యకపోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. కాలనీకి కిలోమీటర్ దూరంలో ఉన్న చేతి పంపుల నుంచి బిందెలతో నీటిని మోసుకుని తెచ్చుకోవాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల నుంచి తాగునీటి సరఫరా లేకపోవడంతో మంచినీటి కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తుందని ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



బిందెలతో నీటిని మోసుకొస్తున్న ఎస్సీకాలనీ వాసులు

బిందెలతో మోసుకొస్తున్నాం



మినీ రక్షిత నీటి పథకం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి కోసం ఊరికి దూరాన ఉన్న చేతి పంపుల నుంచి బిందెలతో మోసుకొస్తున్నాం. అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధించాలి.

– అన్నమ్మ, ఎస్సీ కాలనీ, శిరిపూడి

తంటాలు పడుతున్నాం



గ్రామంలోని మినీ రక్షిత నీటి పథకం నిరుపయోగంగా మారింది. తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నాం. రోజు మంచినీటి కోసం కిలోమీటర్ దూరం వెళ్లాల్సి వస్తుంది. మా బాధలు అర్థం చేసుకుని తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలి.

– మోహనరావు, ఎస్సీ కాలనీ, శిరిపూడి

రెండు రోజుల్లో పునరుద్ధరిస్తాం

శిరిపూడి ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా నిలిచిందని ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. మినీ రక్షిత నీటి పథకం నిర్వహణ గ్రామ పంచాయతీ అధికారులే చూసుకోవాలి. చెక్ వాల్ పాడైపోవడం వల్ల నీటి సరఫరా నిలిచిపోయింది. రెండు రోజుల్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

– రాంకుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

వైఎస్సార్‌సీపీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం



డాక్టర్ గణేష్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన నూతన కమిటీ సభ్యులు

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గంలో వివిధ విభాగాలకు అధ్యక్షులుగా నియమితులైన నాయకులు చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ గణేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికై పార్టీ నుంచి వచ్చే ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. క్రమశిక్షణ కలిగిన నాయకునిగా మెలుగుతూ కార్యకర్త ఆత్మగౌరవాన్ని పెంపొందేలా పని చేయాలన్నారు. పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రేపల్లె పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, మండల కన్వీనర్ మేడికొండ అనిల్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, నాయకులు చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం అందించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: వ్యాధులకు గురైన పశువులకు సకాలంలో వైద్య సేవలందించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం ఎంపీడీవో మండల కేంద్రం కర్లపాలెంలోని పశు వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత పశువుల కాపరులతో పాటు పశు వైద్య సిబ్బందిపై కూడా ఉందని చెప్పారు. వ్యాధులకు గురైన పశువులను యజమానులు వైద్యశాలకు తీసుకువచ్చినప్పుడు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించటంతో పాటు సరైన సలహాలు, సూచనలు అందజేయాలని చెప్పారు. ముఖ్యంగా పాడి పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీనివాసరెడ్డి, రహ్మతున్నీసా తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

తేనెకన్నా తియ్యనైనది మాతృభాష

ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసిన తహసీల్దార్ సలీమా



తెలుగు పండితులు వృషాద్రిపతిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది



కంచిబొట్ల ఫణి రామలింగేశ్వర శర్మను సన్మానిస్తున్న సహృదయ ఫౌండేషన్ నాయకులు

రేపల్లె రూరల్: తేనెకన్నా తియ్యనైనది మాతృభాష అని, అమ్మ ప్రేమలోని మాధుర్యం, మాతృభాషలోని కమ్మదనం ఒక్కటేనని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృదినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను గౌరవించాలన్నారు. ప్రస్తుత కాలంలో యువత ఇతర భాషల మోజులోపడి మాతృభాషను మరిచిపోతున్నారన్నారు. యువత సొంత భాషపై పట్టు సాధిస్తే ఏ భాషనైనా అలవోకగా నేర్చుకోవచ్చని చెప్పారు. తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు వృషాద్రిపతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.కోటేశ్వరరావు, కో ఆర్డినేటర్ నరసయ్య, ఎం.దాసు, బాల గురవయ్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మనుగడ

బాపట్ల: మానవుల అస్తిత్వం, మనుగడ మాతృభాష పైనే ఆధారపడి ఉంటుందని తహసీల్దార్ షేక్ సలీమా పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గల తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సలీమా మాట్లాడుతూ సంస్కృతి పరిరక్షణ మాతృభాషతోనే సాధ్యపడుతుందన్నారు. భావ వ్యక్తీకరణ, భావ గ్రహణకు మాతృభాష కీలకమన్నారు. మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలిపారు. తెలుగు లిపికి, తెలుగు పద్యానికి, తెలుగు తల్లికి బాపట్ల పుట్టినిల్లు అని పేర్కొన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్ర వాదన ఇక్కడే పుట్టిందన్నారు. భాష ప్రాతిపదికగా దేశంలో ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, గుడిపూడి సర్పంచ్ హనుమంజీ, ఆర్ఐ యల్లమంద, సీతామహాలక్ష్మి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం

బాపట్ల: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా చెరుకూరు వాస్తవ్యులు కంచిబొట్ల ఫణి రామలింగేశ్వర శర్మను సహృదయ ఫౌండేషన్ (రైలుపేట) సభ్యులు కార్యాలయంలో శుక్రవార శాలువాలతో ఘనంగా సత్కరించారు. తెలుగు ఉపాధ్యాయులుగా, పద్య కవిగా, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడిగా మాతృభాషకు శర్మ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రామలింగేశ్వర శర్మ మాట్లాడుతూ తెలుగువాడిగా పుట్టడం తన అదృష్టమని, ఉపాధ్యాయుడిగా విద్యార్థులను తీర్చిదిద్దటం తన బాధ్యత అని, ప్రాచీన నవీన కవులకు నేను రుణపడి ఉంటానన్నారు. ఈ సభలో పి.శ్రీకాంత్, సీహెచ్ శ్రీరామ శర్మ, జి.వెంకటేశ్వరరావు, సాయి, గణేష్, గూడ భట్టు, పద్మవల్లి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే



బాపట్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షుల జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో యూత్ వింగ్ ఆట్ల మోహినీప్రసాద్‌రెడ్డి, మహిళా విభాగం వేల్పుల మీరాబీ, రైతు విభాగం ఆట్ల నాగేశ్వర్‌రెడ్డి, బీసీ సెల్ పీటా వేణుగోపాల్, ఎస్సీ సెల్ బడుగు ప్రకాశ్‌రావు, ఎస్టీ సెల్ పాకల రాజేష్‌కుమార్, మైనార్టీ సెల్ షేక్ జాకీర్‌హుస్సేన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ పెరికల రూతు జైశీల్‌బాబు, స్టూడెంట్స్ వింగ్ చింతల రాజశేఖర్, పంచాయతీరాజ్ వింగ్ పిన్నిబోయిన ప్రసాద్, మున్సిపల్ వింగ్ షేక్ సయ్యద్ పీర్, ఆర్‌టీఐ వింగ్ జోగి రాజాబాబు, వలంటీర్ వింగ్ పాలపర్తి గోపికృష్ణ, గ్రీవెన్స్ సెల్ నర్రా వెంకట్రావు, వాణిజ్య వింగ్ నాగవరపు కృష్ణమూర్తి, వైఎస్సార్‌టీయూసీ అక్కల శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ వింగ్ కె.సుగుణమ్మ, లీగల్ సెల్ బిల్లా స్టాన్లీ విమల్‌కుమార్, సాంస్కృతిక వింగ్ షేక్ మస్తాన్‌వలి, సోషల్ మీడియా వింగ్ అడే రవివర్మకుమార్(చందు), ఐటీ వింగ్ దారా సునీల్‌బాబు, దివ్యాంగుల విభాగం ఎం.మౌనిక, డాక్టర్స్ వింగ్ ఎం.సురేష్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఇంటిలెక్చువల్ ఫోరం ఎస్.ఎస్.ప్రకాశ్, బూత్ కమిటీలు దొంతిరెడ్డి కోటిరెడ్డిలను నియమించారు.

ముగిసిన ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జరిగిన క్యాంప్‌లో ఈఎన్‌టీ, అప్తామాలజీ, ఆర్థోపెడిక్ విభాగ వికలాంగులకు పరీక్షలు చేశారు. క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆయా విభాగాల వైద్యులు సేవలు అందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

పద్మశాలీయ అన్నదాన సత్రంపై కూటమి పక్షపాతం



గోవాడ పద్మశాలీయ అన్నదాన సత్రం

అమర్తలూరు(వేమూరు): శ్రీలీలా భవాని పద్మశాలీయ బహుత్తమ సంఘం వారి అన్నదాన సత్రం వ్యవహారంలో కూటమి ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోందని పద్మశాలీయ సత్రం కమిటీ సభ్యులు ఆరోపించారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో వేంచేసి ఉన్న బాలకోటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో పద్మశాలీయ అన్నదాన సత్రం ఉంది. ఈ సత్రం ఆధ్వర్యంలో ఏటా మహా శివరాత్రి తిరునాళ్ల రోజు స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి రోజున అన్నదానం చేపట్టేందుకు పద్మశాలీయ సంఘం సభ్యులు సన్నద్ధమవుతున్నారు. గతంలో అన్నదానం సత్రంలో డబ్బుల వ్యవహారంలో సంఘం రెండు వర్గాలుగా చీలిపోయింది. కాగా ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఒక వర్గాన్ని అన్నదానం చేయకుండా అడ్డుకుంటుందని పద్మశాలీయ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019–24 మధ్య పద్మశాలీయ సంఘం వారు సత్రం లోపల.. వేరొక వర్గం సత్రం బయట అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేరొక వర్గానికి చెందిన పద్మశాలీయ సంఘం సభ్యులను సత్రం లోపల, బయట కూడా అన్నదానం చేపట్టేందుకు పంచాయతీ అధికారులు అనుమతిస్తున్నారని పద్మశాలీయ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు వర్గాలుగా అన్నదానం

బాలకోటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడిగా మాచర్ల నాగరాజును ఎన్నుకున్నారు. సత్రంలో అన్నదానం నిర్వహించే డబ్బులు రూ 2.5 లక్షలు మాయం చేయటంతో.. మరొక వర్గం 2010లో భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేసి, నిధులు దుర్వినియోగం కేసు నమోదు చేశారు. తెనాలి సబ్ జైలుకు నాగరాజును పంపించారు. జైలు నుంచి వచ్చిన తర్వాత పద్మశాలీయ సంఘం అధ్యక్షుడిగా కొనసాగేందుకు తెనాలి సివిల్ కోర్టును ఆశ్రయించగా.. అధ్యక్ష పదవి చెల్లదని తీర్పు ఇవ్వడంతో హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు కూడా చెల్లదని తీర్పు ఇవ్వడం జరిగింది. 2019 నుంచి పద్మశాలీయ సంఘం సభ్యులు సత్రం లోపల.. మాచర్ల నాగరాజు వర్గం సత్రం బయట అన్నదానం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మాచర్ల నాగరాజు వర్గానికి కొమ్ము కాస్తోంది. పంచాయతీ కార్యదర్శి సత్రంలో అన్నదానం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని పద్మశాలీయ సంఘం సభ్యులు కోరుతున్నారు.

అధికార పార్టీ అడ్డగోలు



గోవాడ పద్మశాలీయ అన్నదాన సత్రం వ్యవహారంలో అధికార పార్టీ అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం సత్రం లోపల చేపట్టడం జరిగింది. ఈ ఏడాది సత్రం లోపల అన్నదానం కార్యక్రమం చేపట్టకుండా అడ్డుకుంటున్నారు.

– సంగాబత్తుని వెంకటేశ్వర్లు, భట్టిప్రోలు

నాగరాజుకు అధికార పార్టీ అండ



గోవాడ అన్నదాన సత్రం సంఘంతో నాగారాజుకు ఎలాంటి సంబంధం లేదు. అధికార పార్టీ అండతో సత్రం లోపల అన్నదానం చేపట్టకుండా అడ్డుకుంటున్నాడు.

– పి.వెంకట వర ప్రసాద్

నాటుసారా తయారు చేయడం చట్టరీత్యా నేరం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్



నగరం: నాటుసారా తయారుచేయడం చట్టరీత్యా నేరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్ చెప్పారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం విక్రయాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. బెల్లం వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాటుసారా తయారీ చేసేవారికి బెల్లం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నాటుసారా, మాదక ద్రవ్యాల వినియోగం మానవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. యువత వీటి జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాలలో ఎక్కడైనా నాటుసారా, గంజాయి విక్రయాలు జరుగుతుంటే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రోల్ ఫ్రీ నెంబర్ 14405 లేదా 949045559, 9440902477 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

భూ యజమానులు రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్



తెనాలిటౌన్: వ్యవసాయశాఖ రెవెన్యూశాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయభూమి యాజమానుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టినట్లు వెల్లడించారు. మండలంలోని రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ వెంట తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్ళితే వ్యవసాయ సహాయకులు రైతుకు రిజిస్ట్రేషన్ చేసి యునిక్ నెంబర్ ఇస్తారని తెలియజేశారు. దీనివలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తిస్తాయని వెల్లడించారు. పంట రుణాలు, పంటల భీమా, పంట కొనుగోలు ఇకపై ఈ నెంబర్ ద్వారా మాత్రమే సమర్ధవంతంగా అమలు చేయబడతాయని చెప్పారు. రైతులు తప్పని సరిగా రైతు సేవా కేంద్రానికి వెళ్ళి రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

సృజనాత్మకతకు సైన్స్ క్విజ్ పోటీలు దోహదం



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తెనాలిటౌన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ క్విజ్ పోటీలు దోహదపడతాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శివపార్వతి తెలిపారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. వెజిటేబుల్, ఫ్రూట్ కార్వింగ్, ఫైర్ లెస్ కుకింగ్ అనే అంశాలపై పోటీలు నిర్వహించి ప్రదర్శనలో ఉన్నతంగా రాణించిన విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా విద్యార్థులకు కుకింగ్ అంశాలపై పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. రకరకాల ఫ్రూట్స్, వెజిటేబుల్స్‌తో విద్యార్థులు అందమైన డిజైనర్లు తయారు చేసినట్లు వివరించారు. ప్రదర్శనలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిటైర్డ్ బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయినీ ధూళ్ళిపాళ్ళ స్వర్ణలత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం బ్యాంకు ఉద్యోగుల నిరసన



తెనాలి: ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తగినన్ని నియామకాలు చేసి, ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని భారతీయ స్టేట్‌బ్యాంక్ ఎస్‌యూఏసీ, తెనాలి రీజియన్ కార్యదర్శి ఆర్.ప్రేమకుమార్ డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ భారతీయ స్టేట్‌బ్యాంక్ బజార్ బ్రాంచి ఎదుట యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు నిరసన తెలియజేశారు. వారానికి అయిదురోజుల పనిదినాలు, బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చే రాయితీలపై పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా గ్రాట్యుటీ సవరించి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. తమ సమస్యల సత్వర పరిష్కారానికై మార్చి 24, 25 తేదీల్లో తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ నాయకులు చంద్రశేఖర్, విశాలాక్షి, తెనాలి బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.